క్లుప్తంగా

విద్యార్థులంతా మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ విజయబాబు, తదితరులు

మద్దిలపాలెం : డాక్టర్ వి.ఎస్.కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర, వాతావరణ కార్యాచరణ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు. అనంతరం ప్లాస్టిక్ నిషేధించాలని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయబాబు మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ అనుకూల జీవనశైలిని అనుసరించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, ఎన్ఎస్ఎస్ జోనల్ ఆఫీసర్ డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ జి.విజయ ప్రతాప్, డాక్టర్ బి.లక్ష్మి, డాక్టర్ బి.నాగేశ్వరరావు, యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ టి.రామకృష్ణ, సీనియర్ లెక్చరర్లు డాక్టర్ కె.రామారావు, డాక్టర్ పి.గోపాల నాయుడు, డాక్టర్ ఎం.గోపి, డాక్టర్ ఎన్.భగవాన్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు ఎస్.కె.ఎల్.రావు, బి.సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న వీసీ ఆచార్య రాజశేఖర్

మద్దిలపాలెం : ఆంధ్ర యూనివర్సిటీలో శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. అనంతరం గ్రంథాలయం ప్రాంగణంలో పలు మొక్కలు నాటారు. రీడింగ్ రూమ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మౌలిక వసతులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, అకడమిక్ డీసీ కె.శ్రీనివాసరావు, పలువురు ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బోన్ మ్యారో దాతలు ముందుకు రావాలి



అపోలో క్యాన్సర్ విభాగంలో బోన్ మ్యారో చికిత్స చేసుకున్న వారితో వైద్యులు

ఆరిలోవ : బోన్ మ్యారో దాతలు ముందుకొచ్చి క్యాన్సర్ రోగులను ఆదుకోవాలని అపోలో అంకాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ రాకేష్‌రెడ్డి కోరారు. ప్రపంచ బోన్ మ్యారో దాతల దినోత్సవాన్ని అపోలో క్యాన్సర్ సెంటర్‌లో దాత్రి బ్లడ్ స్టెమ్ సెల్ రిజిస్ట్రీ సహకారంతో శనివారం నిర్వహించారు. బోన్ మ్యారో (ఎముక మజ్జ) దాతలు, వారి సహకారంతో చికిత్స పొందిన వారితో కలిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోన్ మ్యారో ప్రాముఖ్యతను వివరించారు. దాతలు వల్ల క్యాన్సర్ రోగులు ఏవిధంగా వ్యాధి నుంచి బయటపడతారో తెలిపారు. 18 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసు గల వారు స్వచ్ఛందంగా స్టెమ్ సెల్ దాతలుగా నమోదు చేసుకోవాలని కోరారు. అలాంటి వారు క్యాన్సర్ రోగులకు ప్రాణదాతలుగా నిలుస్తారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణప్రసాద్, జె.రామచంద్ర, అంకాలజీ వైద్యులు డాక్టర్ ప్రదీప్, డాక్టర్ పి.రవీంద్ర కుమార్, డాక్టర్ జి.వేణి ప్రసన్న, డాక్టర్ సంతోషి మాధురి పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో పీవీఎన్ మాధవ్, బీజేపీ నాయకులు

ఎంవీపీ కాలనీ : ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేపీ జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. ప్రధాని మోదీ దేశాభివృద్ధికి అందిస్తున్న సేవలను కొనియాడారు. అనంతరం పలువురు నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, వెంకటరావు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 16, 23వ వార్డుల్లో అస్తవ్యస్తంగా రహదారులు
- భూగర్భ డ్రైనేజీ పనుల కోసం తవ్వేయడంతో అవస్థలు
- సకాలంలో పూడ్చకపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు
- చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారడంతో నరకయాతన

రోడ్లు తవ్వి... వదిలేశారంతే..



భూగర్భ డ్రైనేజీ పనుల కోసం తవ్విన తర్వాత మరమ్మతులు చేపట్టకపోవడంతో కేఆర్ఎం కాలనీ తెలుగుతల్లి జంక్షన్‌లో అధ్వానంగా తయారైన రోడ్డు



గోతులమయంగా జేఆర్ నగర్ కాలనీ రోడ్డు



రహదారి మధ్య నుంచి తవ్వేసి... మళ్లీ తారు వేయకపోవడంతో అధ్వానంగా మారిన రోడ్డు

మద్దిలపాలెం : స్మార్ట్‌సిటీలో రోడ్లను సుందరంగా తీర్చిదిద్దుతామని నాయకులు ఇచ్చిన హామీలు నేటికీ కార్యరూపం దాల్చడం లేదు. కొత్తగా రహదారులు నిర్మించడం మాట అటుంచితే... భూగర్భ డ్రైనేజీ పనుల కోసం తవ్వేసిన రోడ్లను సకాలంలో పూడ్చక స్థానికులు, వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. తవ్వి వదిలేసిన ప్రాంతాలన్నీ చిన్నపాటి వర్షానికే బురదమయం కావడంతో చిత్తడిగా మారుతోందని... నడిచి వెళ్లేందుకు కూడా నరకయాతన అనుభవిస్తున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతుకుల రోడ్లపై రాకపోకలు సాగించడం ప్రాణసంకటంగా మారిందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా జీవీఎంసీ 23వ వార్డులోని ఏ కాలనీలో చూసినా రోడ్లన్నీ అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి. భూగర్భ డ్రైనేజీ పనుల కోసం తవ్వేసి... మరమ్మతులు చేపట్టకుండా వదిలేయడంతో కాలనీ వాసులు గగ్గోలు పెడుతున్నారు. కేఆర్ఎం కాలనీలో గణేష్‌నగర్ కాలనీ రోడ్డును మధ్య నుంచి తవ్వేశారు. పనులు పూర్తయిన తర్వాత ఆ గోతులను సవ్యంగా పూడ్చలేదు. ఫలితంగా గోతులతోపాటు, రాళ్లు తేలడంతో ఆ మార్గంలో రాకపోకలకు స్థానికులు అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే మొత్తం బురదమయంగా మారిపోవడంతో జారి పడిపోతున్నామని వాపోతున్నారు. అలాగే 23 వార్డులోని 60 అడుగుల రోడ్డులో తెలుగుతల్లి విగ్రహం జంక్షన్ వద్ద రోడ్డు పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ఇక్కడి రోడ్డు మధ్యలో గోతులు తవ్వేశారు. పనులు పూర్తయిన తర్వాత తవ్విన చోట తారుతో మరమ్మతులు చేయలేదు. దీంతో గోతులమయంగా మారిన రోడ్డుపై రాకపోకలు ఇబ్బందికరంగా మారాయి.

> **సకాలంలో మరమ్మతులు చేయాలి**
>
> కేబుల్ పనుల కోసం తవ్విన గోతులకు సకాలంలో మరమ్మతులు చేపట్టి పూడ్చాలి. తవ్వి వదిలేస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. వాహనాలు పాడైపోతున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి పనులు చేయించాలి.
>
> – ఎస్.నాగేశ్వరరావు, జేఆర్‌నగర్

> **వర్షం కురిస్తే బురదమయం**
>
> తవ్వి రోడ్లపై తారు వేయకపోవడంతో చిన్నపాటి వర్షం కురిసినా బురదమయంగా మారతున్నాయి. ఆ సమయంలో రాకపోకలు సాగించాలంటే సాహసం చేయాల్సి వస్తోంది. తక్షణమే అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలి.
>
> – కె.లక్ష్మణ్, అంబేడ్కర్ కాలనీ

పైప్‌లైన్ కోసం ఇష్టారాజ్యంగా తవ్వేయడంతో...

జీవీఎంసీ 16వ వార్డులోని పలు ప్రాంతాల్లో రోడ్లను ఇష్టారాజ్యంగా తవ్వేశారు. పనులు పూర్తయిన తర్వాత మరమ్మతులు చేపట్టకపోవడంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ఇసుకతోట అంబేడ్కర్ కాలనీ నుంచి జేఆర్‌నగర్ కాలనీకి వెళ్లే మార్గంలో రోడ్లను పైప్‌లైన్ పనుల కోసమని తవ్వేశారు. అనంతరం పూడ్చి తారు పూయకపోవడంతో ఆ రోడ్లన్నీ గోతులతో నిండిపోయాయి. దీంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా గోతుల రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లు తవ్వి నెలలు గడుస్తున్నా మరమ్మతులు పూర్తి చేయకపోవడంపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించి రాకపోకలకు అనువుగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు.



చైతన్యనగర్ నుంచి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు దుస్థితి

పేదల పొట్ట కొడుతున్న కూటమి పాలకులు

వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు

మద్దిలపాలెం : చిరు వ్యాపారుల బతుకులను చిదిమేస్తూ కూటమి పాలకులు పైశాచిక ఆనందం పొందుతున్నారని, ఇది నిరంకుశ పాలనకు నిదర్శనమని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త మొల్లి అప్పారావు ధ్వజమెత్తారు. జీవీఎంసీ 16వ వార్డు కృష్ణ కాలేజ్ రోడ్డులో వీధి వ్యాపారులు చిన్న చిన్న బడ్డీలు, తోపుడు బళ్లు, ఫుట్‌పాత్‌పై చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటే..., మానవత్వం లేని కూటమి పాలకులు వారిపై ప్రతాపం చూపిస్తున్నారని మండిపడ్డారు. బడ్డీలు, తోపుడుబళ్లు, వ్యాపార సామగ్రిని ధ్వంసం చేసి విధ్వంసం సృష్టిస్తున్నారని ఆరోపించారు. పేదల జీవనోపాధిపై నిరంకుశంగా



మొల్లి అప్పారావుతో చిరు వ్యాపారులు

వ్యవహరించడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న నీతిమాలిన, పిరికిపంద చర్యకు ప్రజలే తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ 16వ వార్డు అధ్యక్షుడు చొల్లంగి నాగేశ్వరరావు, బాధిత వ్యాపారులు పాల్గొన్నారు.

తీర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న వీసీ రాజశేఖర్, తదితరులు



తీర ప్రాంతంలో వ్యర్థాలు సేకరిస్తున్న వీసీ రాజశేఖర్, ఆచార్యులు

ఏయూ క్యాంపస్ : సముద్రాలు ప్రాణవాయువును అందిస్తూ, ప్రాణదాతలుగా నిలుస్తున్నాయని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. అంతర్జాతీయ తీరప్రాంత పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని సెంటర్ ఫర్ స్టడీస్ ఆన్ బే ఆఫ్ బెంగాల్, ఇన్‌కాయిస్ సంయుక్తంగా బీచ్ రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తీర ప్రాంతాలు పర్యాటకంగా ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉంటాయని, వీటిని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. స్వచ్ఛ సురక్షిత్ సాగర్ క్యాంపెయిన్‌లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, ఆచార్య పి.రామారావు, ఇన్‌కాయిస్ శాస్త్రవేత్తలు డాక్టర్ అనురాధ, డాక్టర్ గంగాభవానీ పాల్గొన్నారు.

సముద్రాలను సంరక్షించాలి

సముద్ర తీర ప్రాంతాలను సంరక్షించుకోవాలని ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ అన్నారు. శనివారం ఉదయం తీరప్రాంత పరిశుభ్రత దినోత్సవాన్ని పుర్కరించుకుని ఆర్.కె.బీచ్ వద్ద మెరైన్ లివింగ్ రిసోర్సెస్, జువాలజీ, పర్యావరణశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, ఆచార్య పి.జానకిరామ్, ఆచార్య వీరభద్రం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 160 కిలోల వ్యర్థాలను సేకరించి జీవీఎంసీకి అందజేశారు. కార్యక్రమ నిర్వహణకు నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్ సహకారం అందించింది.

ఆరిలోవలో కొనసాగుతున్న బడ్డీల తొలగింపు



దుర్గాలమ్మ గుడి వద్ద బడ్డీలు తొలగించడాన్ని అడ్డుకుని పోలీసులతో వాగ్వాదం చేస్తున్న సీపీఐ నాయకులు, చిరువ్యాపారులు

ఆరిలోవ : జీవీఎంసీ చేపట్టిన రోడ్డు పక్కన ఆక్రమణలు తొలగింపు కార్యక్రమం ఆరిలోవ ప్రాంతంలో కొనసాగుతోంది. ప్రధాన రహదారికి ఇరుపక్కలా శుక్రవారం ఇక్కడి అంబేడ్కర్ కూడలి, పెదగదిలి ప్రాంతాల్లో అనధికారికంగా నిర్వహిస్తున్న 51 షాపులను తొలగించిన విషయం తెలిసిందే. శనివారం దాన్ని కొనసాగించి బాలాజీనగర్ నుంచి అన్నానగర్ వరకు సుమారు 50 అనధికారిక బడ్డీలు, కొన్ని షాపుల ముందు అనధికారికంగా ఏర్పాటు చేసిన షెల్టర్లు, రోడ్డును ఆనుకుని షాపుల ముందు నిర్మించిన గచ్చులు తొలగించారు. జీవీఎంసీ జోన్ – 2 టౌన్ ప్లానింగ్ ఏసీపీ శాస్త్రి సమక్షంలో జేసీబీతో పోలీస్ బందోబస్తు నడుమ తొలగింపు కొనసాగించారు. దీంతో చిరు వ్యాపారులు స్థానిక సీపీఐ నాయకులతో కలిసి కొంతసేపు తొలగింపును అడ్డుకున్నారు. పోలీసులతో వాగ్వాదానికి సైతం దిగారు. అయితే ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ముందు జాగ్రత్తగా ఆరిలోవ సీఐ హెచ్.మల్లేశ్వరరావు, సిబ్బంది అక్కడ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు చిర వ్యాపారులతో కలిసి కొంతసేపు నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం పేదల పొట్ట కొడుతోందని, రోడ్డు మీద బతుకుతున్న పేదలను ఇబ్బంది పెడుతోందని సీపీఐ నాయకుడు రెహమాన్ ఆరోపించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ ఈ తొలగింపులను ఆపడం లేదని, అసెంబ్లీ సమావేశాల్లో ఉన్నానంటూ తప్పించుకుంటున్నారని విమర్శించారు.



బాలాజీనగర్‌లో రోడ్డును ఆక్రమించి నిర్మించిన గచ్చు తవ్వేసిన దృశ్యం

ఇగ్నో ప్రవేశాల గడువు పెంపు

ఎంవీపీ కాలనీ : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2025 జూలై ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తుల గడువును పొడిగించినట్లు విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇగ్నో ద్వారా డిగ్రీ, పీజీ, ఎంబీఏ, డిప్లమో, సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ ప్రవేశాలు పూర్తిగా ఆన్‌లైన్‌లో జరగనున్నాయి. కేంద్రం పరిధిలోని 5 జిల్లాల విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నారు. https://ignouadmission.samarth.edu. in/ వెబ్‌సైట్ ద్వారా అర్హులైన విద్యార్థులు ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ ప్రవేశాలకు గడువు సెప్టెంబర్ 30 వరకు పొడిగించారు.

పేదల కడుపుకొట్టి పైశాచిక ఆనందం

బీచ్‌రోడ్డు : పొట్ట కూటి కోసం రోడ్డుపై పెట్టుకున్న బడ్డీలను కూటమి ప్రభుత్వం తొలగించి పేదలను ఏడిపిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా మున్సిపల్ విభాగం కార్యదర్శి పిలక మధుసూదన్ రెడ్డి మండిపడ్డారు. నగరంలో నిరుపేదలు పెట్టుకున్న బడ్డీలను, షాపులను తొలగించడంపై ఆయన శనివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు పేదల కడుపు కొట్టి పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయిన్నారు. కూటమి నాయకలను తరిమి కొట్టే సమయం ఆసన్నమైందన్నారు. త్వరలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చి ప్రజలకు అండగా నిలిచి, ఆర్థిక భరోసా కల్పిస్తారన్నారు.

బడ్డీల తొలగింపు ఆపేయాలి

ఎంవీపీ కాలనీ : నగరంలోని చిరు వ్యాపారులపై జీవీఎంసీ యంత్రాంగం చేస్తున్న దౌర్జన్యకాండ తక్షణమే నిలిపి వేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ శనివారం డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు నిబంధనలకు అనుగుణంగా చిరు వ్యాపారులకు హాకర్స్ జోన్స్ ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు అందించాలని కోరారు. ఏళ్ల తరబడి చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారి బడ్డీలు, తోపుడుబళ్లు తొలగించడం దారుణమన్నారు. బడ్డీల తొలగింపును ఆపకపోతే... ఈ అంశంపై సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ఆందోళన చేయనున్నట్లు తెలిపారు.

దసరా మహోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రణవ్ గోపాల్

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ 28వ వార్డు రామ్‌నగర్ సమీపంలోని దుర్గా మల్లేశ్వరి ఆలయంలో దసరా మహోత్సవాలను ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ అభివృద్ధి సంఘం చైర్మన్ మార్గాన వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు దసరా మహోత్సవాల పోస్టర్‌ను వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ శనివారం సిరిపురంలో ఆవిష్కరించారు. ఉత్సవాల తొలి రోజైన సోమవారం ఉదయం అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు నిర్వహిస్తామని సంఘం సభ్యులు తెలిపారు. అదే రోజు రాత్రి 7 గంటలకు సేవ గరిడి నిర్వహిస్తామన్నారు. అమ్మవారిని రోజుకో అవతారంలో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తామని తెలిపారు. మహేష్, కృష్ణ, బేకరీ రవి, పల్లా దుర్గ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల్లో ఆరిలోవ నాయకులు



అల్లంపల్లి రాజబాబు



గూడపాటి వి.డబ్ల్యూ జోసెఫ్

ఆరిలోవ : మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో పార్టీ అధిష్టానం రాష్ట్ర అనుబంధ కమిటీల్లో నాయకులను శనివారం నియమించింది. ఇందులో భాగంగా విశాఖ తూర్పు నియోజకవర్గానికి చెందిన ఇద్దరికి అవకాశం కల్పించింది. నియోజకవర్గంలో ఆరిలోవకు చెందిన వారిని ఎస్సీ సెల్ విభాగంలో నియమించారు. జీవీఎంసీ పన్నెండో వార్డుకు చెందిన అల్లంపల్లి రాజబాబును రాష్ట్ర ఎస్సీ సెల్ అఫీషియల్ స్పోక్స్‌పర్సన్‌గా, పదమూడో వార్డుకు చెందిన గూడపాటి వి.డబ్ల్యూ జోసెఫ్ (విక్టర్)ను రాష్ట్ర ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా నియమించారు. పార్టీ ప్రారంభం నుంచి ఉన్న వీరిద్దరికీ అధిష్టానం తగిన గుర్తింపు ఇచ్చిందని వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు అభినందనలు తెలిపారు. తమపై మరింత బాధ్యత పెరిగిందని, పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తామని వారిరువురు నాయకులు తెలిపారు. తమకు పదవులు ఇచ్చిన మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. పదవులు రావడం కోసం కృషి చేసిన పార్టీ రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ ముఖ్య నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రాజబాబు గతంలో జిల్లా మార్కెటింగ్ శాఖ అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు.

గ్రీన్ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సహకరించాలి

ఆరిలోవ : గ్రీన్ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ నగరవాసులకు పిలుపునిచ్చారు. జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి జోడుగుళ్లపాలెం బీచ్‌లో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ జీవీఎంసీ అధికారులతో కలిసి తీర ప్రాంతంలో చెత్త సేకరించి శుభ్రం చేశారు. పరిసరాల్లో పచ్చదనం కోసం మొక్కలు నాటారు. ఇక్కడ జీవీఎంసీ ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ నియంత్రణ, సీజనల్ వ్యాధులకు సంబంధించిన స్టాళ్లను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. ప్రతీ నెల మూడో శనివారం చేపడుతున్న స్వర్ణాంధ్రా – స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రస్తుతం విశాఖ కాలుష్య కోరల్లో చిక్కుకుందన్నారు. దీని నుంచి నగరాన్ని కాపాడుకుని గ్రీన్ విశాఖగా తీర్చిదిద్దుకోవడానికి అందరి భాగస్వామ్యం అవసరముందన్నారు. ఇళ్ల నుంచి విధిగా చెత్తను పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎస్.వి.నరేష్ కుమార్, జోన్ – 2 జెడ్సీ కె.కనకమహాలక్ష్మి, డీడీహెచ్ ఎం.దామోదరరావు, ఏఎంవో డాక్టర్ రవి కుమార్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ ముకుంద, కోరమాండల్ ఫెర్టిలైజర్స్ ప్రతినిధులు, విశాఖ కంటోన్మెంట్ టెర్మినల్ ప్రతినిధులు పాల్గొన్నారు.



జోడుగుళ్లపాలెంలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

ఏయూ అంతర్ కళాశాలల కబడ్డీ విజేతలకు బహుమతులు

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల పురుషుల కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. విజేతలకు ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ బహుమతులు అందజేశారు. కబడ్డీ ఫైనల్స్ సమతా కాలేజీకి, ఆళ్వార్ దాస్ డిగ్రీ కాలేజీకు మధ్య ఏయూ వ్యాయామ విద్యా విభాగంలో నిర్వహించారు. నిర్ణీత సమయంలో అళ్వార్ దాస్ డిగ్రీ కళాశాల జట్టుకు 33 పాయింట్లు, సమతా కళాశాల జట్టుకు 20 పాయింట్లు వచ్చాయి. 13 పాయింట్ల ఆధిక్యంతో అళ్వార్ దాస్ జట్టు విజేతగా నిలిచింది. మూడో స్థానం కోసం సాంకేతిక కళాశాల, డాక్టర్ వి.ఎస్.కృష్ణ కళాశాల మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో డాక్టర్ వి.ఎస్.కృష్ణ కళాశాలకు 21 పాయింట్లు రాగా సాంకేతిక కళాశాలకు 19 వచ్చాయి. దీంతో కృష్ణా కళాశాలకు మూడో స్థానం దక్కింది. కార్యక్రమంలో ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య ఎస్.విజయ మోహన్, ఆచార్య ఎ.పల్లవి, ఆచార్య బి.షారోన్ రాజు, ఆచార్య ఎస్.ఎం.యుగంధర్ పాల్గొన్నారు.



విజేత జట్టు సభ్యులకు బహుమతి అందిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్